# పసిడి మనసు



నీలిరంగు సిల్కుపాంటు, టకప్‌చేసిన తెల్లని సిల్కుషర్టు. నడుముకు తెల్లని వైరుతో చేయబడిన బెల్టు! మెడనుంచి నీలిరంగు టై! నల్లగా నిగనిగ లాడుతున్న బూటు! తలకు చిన్నటోపి! ఇది రవిబాబు ముస్తాబు! తాతయ్య గదిలోకి వచ్చేడు తీవిగా చేతులూపుకుంటూ! ముందు గదిలో వాలుకుర్చీలో పడుకుని రామదాసు కీర్తనలు పాడుకుంటున్న తాతయ్యని పలకరిస్తూ —

"తాతయ్యా! నా డ్రస్సు ఎలావుంది? ఇటు చూడు." రవి తాతయ్య చేతులుపట్టి గుంజుతూ ఉత్సాహంగా ఎంత తీవిగా వచ్చాడో, అంత తీవిగానూ అడిగేడు.

కుమారి ఎ. రంగనాయకి

బుల్లిసైజు దొరలావుంది. ముద్దులు మూటగట్టుతున్న మనుమడిని చూసే సరికి - తాతయ్యగుండెలు ప్రేమతో పొంగేయి.

"చాలా బాగున్నాయి! బాబూ!" అంటూ ఒడిలోకి తీసుకుని రవిబాబు బుగ్గలమీద ముద్దులవర్షం కురిపించేడు.

"తాతయ్యా! మరేం! ఎల్లుండి నాపుట్టిన రోజుకదా! అమ్మ నాకు ఇంకొక డ్రస్సు కుట్టించింది. అది పాంటుకూడా తెలుపే! ఇంకా అమ్మా - నాన్నకూడా కొత్తబట్టలు కొనుక్కున్నారు. మరి నీవుకూడా కొత్తబట్టలు కట్టుకుంటావా? ఆవేళ?" తాతయ్య ముఖంలోకి ఉత్సాహంగాచూస్తూ అడిగేడు.

"అలాగే బాబూ! తప్పకుండా కట్టుకుంటాను." తాతయ్య రవికి సమాధానం చెప్పేడు.

"తాతయ్యా! మరేం లడ్డూలు, జిలేబీలు చేసింది అమ్మ నాకిష్టమని. నాన్నగారు బిళ్ళలూ - బిస్కట్లూ అన్నీ తెచ్చేరు. నాక్లాసు పిల్లలందర్నీ పిలిచి వాళ్ళకి పంచిపెడతాను. మరి నీకు కూడా లడ్డూలు యిష్టమేనా? తింటావా?"

"అలాగే బాబూ! నాకన్నీ యిష్టమే." తాతయ్య రవిబుగ్గలను - మరోసారి ఆప్యాయంగా ముద్దు పెట్టుకున్నాడు.

"రవీ! బడికి టైము అయిందని వెళ్ళమనిచెప్పి ఎంతసేపు అయింది? పెద్ద కబుర్లాడుతూ కూర్చున్నావ్! ఆలస్యంగా వెడితే - మేష్టారు కొడతారనే భయమైనాలేదు వెధవకి. పోనీ మీరయినా చెప్పకూడదు టండీ, బడికివెళ్ళమని." కోడలు సీతగొంతులో ధ్వనించిన చిరాకుకి కోపానికి తాతయ్యచిత్తం చివుక్కుమంది. నిజంగా స్కూలుకి టైము అయిందని కాదు సీతకికోపం. కోడలు సీతకిష్టంకాని విషయాలలో తనూ, రవీ కలసి మాట్లాడుకోవటం ఒకటి. కోడలు విసుగుని గ్రహించిన తాతయ్య —


"మేష్టారు కోప్పడతారు బాబూ! ఆలస్యంగా వెళితే. వెళ్లుబాబు ఇంక!" తాతయ్య ఒడిలోంచి రవిని మెల్లగా దింపేడు.

"ఇంకా టైము కాలేదు. తాతయ్యా! ఛ. అమ్మ ఎప్పుడూ ఇంతే!"

"వెళ్లుబాబూ! అమ్మమాట చెప్పినట్లు వినాలి. అలా అనకూడదు." తాతయ్య మెల్లిగా అన్నాడు. రవి పుస్తకాల బేగ్ని తగిలించుకుని వెళ్ళిపోయేడు

ఆరోజు రవి పుట్టినరోజు! చిన్న పెళ్ళంత సంబరం! రవి స్నేహితులంతా వచ్చేరు. బిళ్ళలు - బిస్కట్లు అందరికి పంచిపెట్టేడు రవి. సీత పేరంటాళ్ళ హడావిడిలోవుంది.

స్నేహితులు వెళ్ళుతుంటే - వాళ్ళ వెనకవచ్చిన రవి. గమ్మున ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా వంటగదిలోకి వెళ్ళి అలమారాతీసి - అలమారాలోని టిఫిన్ కారియరుల మూతలుతీసి — రెండు




లడ్డూలు - రెండు జిలేబీచుట్టలు పట్టుకుని సీతకి చాటుగావచ్చేడు.

"తాతయ్యా! ఇవి తినిచూడు. ఎంత బాగున్నాయో!" తాతయ్య చేతిలో పెట్టేడు రవిబాబు!

రవిబాబు ఆప్యాయతకు - తాతయ్యకు మనస్సు పొంగిపోయింది తెల్లని తెలుపు డ్రస్సులో 'స్వచ్ఛత'కి చిహ్నంలా వున్న రవిబాబుని నిండుమనస్సుతో ఆశీర్వదిస్తూ, తాతయ్య లడ్డూని నోటిలో వేసుకున్నాడు.

"తాతయ్యా! మరి నీవుకూడా కొత్త బట్టలు కట్టుకోలేదేమి?" తాతయ్య కొత్త బట్టలమాట మర్చిపోని రవి అడిగేడు.

"కట్టుకుంటాలే బాబూ! తర్వాత!"

"ఇంకా ఎప్పుడు? అంతా అయిపోయేక? ఉండు నేతెచ్చియిస్తా." అంటూ రవి తాతయ్య పెట్టెదగ్గరకు వెళ్ళేడు. తాళంలేని పెట్టెనంతా వెదికేడు. కాని కొత్తబట్టలు ఎక్కడా కనుపించలేదు..

"తాతయ్యా! కొత్తబట్టలు కట్టుకుంటానన్నావ్? ఏవి? పెట్టెలోలేవు. ఎక్కడున్నాయి?" రవి అమాయకంగా నిలదీస్తుంటే - తాతయ్య చిక్కులో పడిపోయేడు.

"అదికాదు బాబూ! కొట్టులో వున్నాయి కొత్తబట్టలు. నాన్నజీతం అందేక తెచ్చియిస్తాడు, అప్పుడు కట్టుకుంటాను. అమ్మ పిలుస్తున్నట్లుంది. వెళ్ళుబాబూ!" తాతయ్య రవిని తప్పించుకుందుకు ప్రయత్నించేడు.

"ఏం? నీకు డబ్బుందా ఏం? కొనుక్కుండుకు?'' రవి తాతయ్యకేసి చూసేడు అమాయకంగా.

"ఊహుఁ! మరి నేను ఉద్యోగం చేయటంలేదుకదూ!" తాతయ్య రవి తల నిమురుతూ అన్నాడు.

ఇంతలో సీత 'రవీ' అని పిలకటంతో తాతయ్య రవిని పంపించివేసి తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు.

ఓపక్కనుంచి పుట్టినరోజు వేడుక జరుగుతున్నా తాతయ్య మనస్సు అంతరాంతరాలలోంచి అవ్యక్త ఆవేదనతో చుట్టబెట్టుకుపోతోంది. అందరికి అటువంటి అనుభవం అవుతుందో అవదో కాని తనకుమాత్రం ఎంత సంబరంలోనూ ఏదో వేదన అనుభవం అవుతుంది ఎప్పుడూ! అలాగా చెప్పరాని బాధ పడుతోంది మనస్సు.

"ఇంకా గోపీ, లక్ష్మి, బుజ్జి, మురళి, వాళ్ళంతా నీ ముఖ్య స్నేహితులు కదా! వాళ్ళు రాలేదేమిరా ఇంకాను?" సీత అడిగింది రవిని.

"వాళ్ళు ఇందాక లేరమ్మా. ఇప్పుడే వెళ్ళి పిలుచుకు వస్తాను.'' రవి మెరుపులా, వాళ్ళ నాన్న గదిలోకి వెళ్ళిపోయేడు. సీత అప్పుడే పేరంటానికి వచ్చిన సావిత్రిని పల్కరిస్తూ, సావిత్రి కట్టుకున్న 'లేటెస్టు' బెనారస్ జరీచీర మీద పడగా – ఆ చీరమీదకు పోయేయి కబుర్లు.


సావిత్రి ఆ చీర రంగుకోసం, ఆ చీర కోసం తా నెంత అవస్త పడినదీ చెప్పుకొస్తోంది.

ఇంతలో రవి వాళ్ళ నాన్నగదిలోని స్టూలు స్టాండువైపుగా లాగి ఎక్కి, వరుసగా వున్న పాంటుజేబుల్ని తడిమేడు ఓ జేబులోంచి తనకు కావలసినది దొరకగానే, తీసుకుని దాన్ని జేబులోవేసుకుని స్టూలుదిగి దాన్ని యథాస్థానంలో వుంచి తాతయ్య గదిలోకివచ్చాడు.

"తాతయ్యా, మురళీ వాళ్ళు ఇంకా రాలేదు. వాళ్ళని పిలుచుకునిరమ్మంది అమ్మ. నాతో సాయం వస్తావా? తాతయ్యా!" రవిబాబు తాతయ్యని అడిగాడు.

"అలాగే బాబూ" అంటూ తాతయ్య భుజాన కండువావేసుకుని చేతికర్ర తీసుకుని రవిచెయ్యిపట్టుకునివీధిలోకినడిచాడు.

రవి ఏదో అడుగుతున్నాడు తాతయ్య సమాధానాలు చెప్తున్నాడు. కొంత దూరం నడిచినతర్వాత, రవిబాబు తాతయ్య చేతిని వదిలేస్తూ "అదిగో అక్కడ మురళీవాళ్ళు వున్నారు. ఇప్పుడే పిలుచుకువస్తాను. ఇక్కడే వుండు తాతయ్యా! వెళ్ళిపోకు." అంటూ చెంగున పరుగుతీసాడు.




ఎదురుగా చెరకుగడలు పిండిన బరువైన లారీ అప్పటికే మంచి పొగరుగా వస్తోంది.

లారీదగ్గరగా వచ్చేస్తుంటే, రవిని లారీని చూస్తున్న తాతయ్య ఆదుర్దాగా 'రవీ' అంటూ రవికోసం అడ్డం పరుగెత్తాడు. 'బాబూ' అంటూ ఒక్కవురుకు ఉరికిన కిళ్ళీకొట్టు శేషయ్య రవిచెయ్యి పుచ్చుకు రోడ్డుపక్కగా లాగిపారేశాడు.

కాని రవికోసం అడ్డం పరిగెత్తిన తాతయ్యను లారీ ఒక వైపునవిసరిపారేసింది

క్షణంలో జరిగిన దారుణానికి జనం గుమిగూడేరు. స్పృహలేకుండా రోడ్డు ప్రక్క పడివున్న తాతయ్యని మాత్రం బిక్కచచ్చి బేలగా చూస్తూ వుండిపోయేడు రవిబాబు.

కబురు తెలిసిన సీతా, మూర్తీ వచ్చేరు ఇంటిదగ్గర్నించి. 'బాబూ' అంటూ సీత బాబుని గుండెల కదుముకుంది గట్టిగా వణికిపోతూ. భార్యనీ కొడుకునీ ఇంటికి వెళ్ళమని చెప్పి మూర్తి టాక్సీలో ముసలి తండ్రిని ఆస్పత్రికి తీసుకుపోయినాడు

సీత రవి జేబులోంచి కనిపిస్తున్న నోటుని తీసి చూస్తూ... "ఇది ఎవరిచ్చేరు బాబూ! ఎక్కడిది నీకు?" అని అడిగింది.

"మరి తాతయ్యకు కొత్త బట్టలు లేవని, కట్టుకోలేదని, కొత్తబట్టలు కొందామని... నాన్నగారి పాంటుజేబులోంచి తెచ్చానమ్మా!" ఏదీ తెలియని బాధతో బేలగా ఏడుస్తూ చెపుతుంటే. సీత బాబుని గుండెల కదుముకుని – ఇంటివైపుగా దారితీసింది

— —